క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

కోళ్లబావాపురంలో ప్రతిష్ఠోత్సవాలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ గోవిందమ్మ, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ వేడుకలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 19 న ఏకాదశి రోజున గణపతిపూజ, కలశ స్థాపన, జపములు, దీక్షా హోమములు, 20న ప్రాతఃకాల ప్రభాత పూజలు, యంత్ర అభిషేకములు, మహామంగళహారతి, హోమములు, 21న ఆదివారం ప్రతిష్ఠ హోమములు, యంత్ర సహిత విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

పాములపాడు తహసీల్దార్‌గా వెంకటరమణ



పాములపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెంకటరమణ నూతన తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ ఎండోమెంటు డిపార్టుమెంట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, మండల సర్వేయర్ భాస్కర్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను గురువారం ఉపాధిహామీ అంబడ్స్ పర్సన్ సురేంద్రకుమార్, ఎంపీడీఓ గంగావతి పరిశీలించారు. సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం, మెడికల్ కిట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జయంతి, ఫీల్డ్ అసిస్టెంట్ మధుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వసంతోత్సవం



రంగులు చల్లుకుంటూ యువకుల కేరింతలు

పాములపాడు: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో వసంతోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎడ్ల బండిపై రంగును డ్రమ్ముల్లో ఉంచి పురవీధుల్లో తిరుగుత.. యువకులు రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలకు లయబద్ధంగా చిందులు వేస్తూ వేడుక జరుపుకున్నారు. డప్పుల హోరు, యువకుల కేరింతలతో వీధులన్ని రంగులమయంగా మారాయి.

బాలిక అదృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తెకు మానసిక స్థితి సరిగాలేదు. బుధవారం ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు అంతటా వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున వివరించారు.

విద్యుత్ తీగలు తగిలి మంటలు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు నుంచి గురువారం రాత్రి అనంతపురం జిల్లా నార్పలకు లారీలో వరిగడ్డిని తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తగిలి నిప్పంటుకుంది. లారీని ఊరిబయటికి తీసుకెళ్లే క్రమంలో కట్టలు పడటంతో వెనుక ఉన్న ఓ బైక్ కాలిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న కొత్తపల్లెకు చెందిన ఉసేని, కుమార్తె రజియాలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు
- పట్టణంలో భారీ ర్యాలీ



నామినేషన్ వేసి బయటికి వస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఎన్నికల్లో ప్రజలే తమను గెలిపిస్తారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే తమ గెలుపునకు మార్గమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండు మీదుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, న్యాయవాది సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలను ఆర్వో సుధారాణికి అందించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గ అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తప్పుడు హామీలను నమ్మొద్దు

మాజీ సీఎం చంద్రబాబునాయుడు అసత్య ప్రచారాలు చేస్తూ తప్పుడు హామీలు ఇస్తున్నారని శిల్పా అన్నారు. 2014 ఎన్నికల ముందు రైతుల రుణ మాఫీ, పొదుపు రుణాల మాఫీలు, సున్నావడ్డీ రాయితీ, నిరుద్యోగభృతి లాంటి ఎన్నో హామీలను ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇదే తరహాలో ప్రజలను మోసగించేందుకు చంద్రబాబుతో పాటు కూటమి నేతలు పవన్‌కళ్యాణ్, పురంధేశ్వరిలు తప్పుడు హామీ ఇస్తున్నాడని, ప్రజలు నమ్మవద్దని సూచించారు.

మంచి చేశాం కాబట్టే ధైర్యంగా ఓటు అడుగుతున్నాం

ప్రజలకు మంచి చేశారు కాబట్టే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే నాకు ఓటు వేయమని' నిర్భయంగా అడుగుతున్నారని ఎమ్మెల్యే శిల్పా అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారన్నారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజా అభివృద్ధి కోసం ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి కూడా తనతో కలవడం జరిగిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఎన్నికల్లో కలిసిమెలిసి పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు తమను ఆదరించి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లా, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి, పార్టీ మండలాల అధ్యక్షులు రజాక్, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పాలమహేశ్వరరెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, నాయకులు అహ్మద్‌హుసేన్, శిల్పా కార్తీక్ రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు రఫీద్, మార్కెట్‌యార్డు చైర్మన్ బాలస్వామియాదవ్, వైస్ చైర్మన్ అబ్దుల్‌రషీద్, సింగిల్‌విండో చైర్మన్ సురేష్, ఎంపీపీ తిరుపాలమ్మ, రమణారెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, మునీర్‌బాషా, జయకృష్ణ, విష్ణు, ఒట్టి వెంకటరెడ్డి, వెంకటస్వామి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలిరోజు నాలుగు నామినేషన్లు

ఆత్మకూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గం అభ్యర్థులుగా నలుగురు నామినేషన్లు వేసినట్లు ఆర్వో సుధారాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సింగారెడ్డి శిల్పాచక్రపాణిరెడ్డి, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక అభ్యర్థిగా చింతానాగేశ్వర్‌రావు, టీడీపీ అభ్యర్థులుగా బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బుడ్డా శైలజలు తమ నామినేషన్లు అందించారని తెలిపారు.



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, చిత్రంలోఎంపీ పోచా, బుడ్డా శేషారెడ్డి

తొలి రోజు నామినేషన్లు నిల్

నందికొట్కూరు: నియోజకవర్గ కేంద్రంలో గురువారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. తొలిరోజు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో నామినేషన్ వేసే ప్రాంతంలో టౌన్ సీఐ సారథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు సామాన్యులు ఎవరినీ అనుమతించలేదు.

నేడు జలకనూరులో ఎన్నికల ప్రచారం

మిడుతూరు: మండలపరిధిలోని జలకనూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జనసేన నేతపై కోడ్ ఉల్లంఘన కేసు

మహానంది: గిద్దలూరుకు చెందిన జనసేన నేత పగడాల శశిధర్ ఎలాంటి అనుమతి లేకుండా కారులో కరపత్రాలను తీసుకెళ్తుండగా పోలీసులు కోడ్ ఉల్లంఘన కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు గిద్దలూరు నుంచి నంద్యాలకు వస్తున్న శశిధర్ కారులో పవన్ కల్యాణ్‌గారి మనోగతం పేరుతో ఉన్న రెండు వందల కరపత్రాలను తీసుకొస్తున్నారు. వాహనాల తనిఖీలో భాగంగా గుర్తించి, అనుమతి లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పేదల సంక్షేమానికి జగనన్న పెద్ద పీట



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ దారా సుధీర్

పాములపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేస్తే బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు కొనసాగుతాయన్నారు. గురువారం మండలంలోని మద్దూరు, క్రిష్ణానగర్, పెంచికల పల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. మారు మూల పల్లెలు కూడా అభివృద్ధి సాధిస్తున్నాయంటే జగనన్నే కారణమన్నారు. పేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఆశయంతో పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని, ఆ బాధ్యత ప్రజల పై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటువేసి ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు విజయసింహారెడ్డి, పార్టీ కార్యదర్శి మధుసూదన్‌రావు, ఎంపీటీసీ బషీర్ అహ్మద్, నాయకులు జబ్బార్, బాలసుబ్బారెడ్డి, మహానందిరెడ్డి, శ్రీనివాసులు గౌడు, కోటినాయక్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

54 మంది వలంటీర్ల రాజీనామా





ఎంపీడీఓకు రాజీనామాలు సమర్పిస్తున్న బి.కోడూరు వలంటీర్లు, తిమ్మాపురం వలంటీర్లు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గురువారం బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ విజయరావుకు రాజీనామా పత్రాలను అందించారు. అలాగే మహానంది మండలం తిమ్మాపురం, గాజులపల్లె, గోపవరం గ్రామాలకు చెందిన 40 మంది వలంటీర్లు తిమ్మాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి తమ రాజీనామాలను సమర్పించారు.

ఎల్లప్పుడూ అండగా ఉంటా

మహానంది: నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని శ్రీ శైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు గురువారం ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే శిల్పా

నిందితుల అరెస్టు

మహానంది: మండలంలోని శ్రీనగరం గ్రామానికి చెందిన సుబ్బయ్య, బంధుమిత్రులు బుధవారం రాత్రి తిరుపతి వెళ్తుండగా తమ్మడపల్లె దుర్గమ్మ గుడి వద్ద గాలిపడతామని కారును ఆపి బెదిరించిన ఘటనలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమ్మడపల్లె, బుక్కాపురం, బొల్లవరం గ్రామాలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా మద్యం మత్తులో ఈ పనికి ఒడిగట్టారని ప్రాథమికంగా తేలింది.

మహానందీశ్వరుడికి ఏకాంత సేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు గురువారం ఉదయం కల్యాణోత్సవం, రాత్రి ఏకాంత సేవ పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, కల్యాణోత్సవం చేశారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

పాములపాడు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. గురువారం మండలంలోని బానుముక్కల మలుపు వద్ద కేజీ రోడ్డుపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు తీసుకెళ్లే ఏ వస్తువైనా తనిఖీలో బయటపడితే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సుజాతబాయి, వీఆర్వో ఉశేన్ ఉన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిప్రదేశంలో వేతనదారులకు పనిప్రదేశంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకొనేల చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేతనదారులకు పనిప్రదేశంలో నీడ ఉండేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



పుట్టుపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానంది: వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని పోలింగ్ బూత్ కమిటీల కన్వీనర్ కుంచపు శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి అన్నారు. బుక్కాపురం మజరా గ్రామం పుట్టుపల్లెలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు పర్యటిస్తూ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

తోడేళ్లను దీటుగా ఎదుర్కొందాం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన బత్రెగొడ్ల బాబు, నాయకులతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో 100 కుటుంబాలు చేరిక

నందికొట్కూరు: నియోజకవర్గంలో తోడేళ్లను దీటుగా ఎదుర్కొందామని శాప్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మన్సూర్ ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో వాల్మీకి నగర్‌కు చెందిన తెలుగు దేశం పార్టీ నాయకులు బత్రెగొడ్ల బాబు, అబ్దుల్లా, మాసుం బాష, అభి, చాంద్, సమీర్, అన్వర్ బాషా, వజీర్, చాంద్, శ్రీను, హుమాయూన్, రహిమాన్, పండు, గౌస్, అలీం, ఇంతియాజ్, చాంద్, ఫారూక్, ఇమ్రాన్, రహిమాన్, అర్షద్, రియాజ్, రియాజ్, కరీం, ఖాసీంవలి, ఆరీఫ్, ముజీబుర్, అఫ్రీద్, వంశీతో పాటు 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారందరికీ సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జగనన్న తోనే సంక్షేమ రాజ్యం

సీఎం వైఎస్ జగనన్నతోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని తెలిసి టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారని సిద్ధార్థరెడ్డి అన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగనన్నకు ప్రజలు పట్టం కట్టాలన్నారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలకు బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారని గుర్తు చేశారు. 58 నెలలో జరిగిన అభివృద్ధి గతంలో ఏ పాలనలో జరగలేదని చేప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలరు కృష్ణ, నాయకులు బోయ శేఖర్, కోకిల రమణారెడ్డి, ఎండీ ఫయాజ్, జీఎం నూర్ అహమ్మద్, జీఎం చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శిల్పా నామినేషన్‌కు భారీగా తరలివెళ్లిన నాయకులు



శ్రీశైలం ముఖద్వారం వద్ద శిల్పాకు మద్దతుగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బండిఆత్మకూరు ఎంపీపీ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో వెళ్తున్న నాయకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా శిల్పా చక్రపాణిరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి శ్రీశైలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. గురువారం శ్రీశైలం మండల జేసీఎస్ ఇన్‌చార్జ్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీశైలం ముఖద్వారం వద్ద పార్టీ జెండాలు చేతబూని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, శిల్పాకు మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేసుకుంటూ వాహనాల్లో ఆత్మకూరుకు బయలుదేరి వెళ్లారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేశారు.

మహానంది: శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి గురువారం మహానంది, బండిఆత్మకూరు మండలాల నుంచి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల నుంచి మేము...సిద్ధం అంటూ ఉత్సాహంగా కదిలారు. గాజులపల్లెలో యువకులు జగనన్న మాస్కులు ధరించి సిద్ధం అంటూ నినదించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

రమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం





భక్తుల జయజయ ధ్వానాల మధ్య సాగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం, ఎదురుపాడులో భక్తుల నడుమ సాగుతున్న సీతారాముల రథోత్సవం



నందికొట్కూరులో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పగిడ్యాల: శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం పగిడ్యాలలో లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం భక్తజన సందోహం మధ్య రమణీయంగా సాగింది. స్థానిక ఊరవాకిలి నుంచి కుంటవీధి గండి వరకు సాగిన రథోత్సవ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. రథానికి టెంకాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు. రథాన్ని ముందుకు లాగే క్రమంలో వెనుక భాగంలో గొలుసులు పట్టుకుని ఉన్నా ఆచారి హఠాత్తుగా కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు పెద్ద ఎత్తున కేకలు వేయగా రథాన్ని నిలిపివేశారు. అయితే తనకు ఎలాంటి అపాయం కలుగలేదని స్లిప్ అయి కిందపడిపోయానని ఆచారి పేర్కొన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు. రథోత్సవం సందర్భంగా పగిడ్యాల భజన బృందం చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

వైభవంగా సీతారాముల రథోత్సవం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల వార్ల రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పురోహితులు రామయ్య, హరికృష్ణ, గ్రామ పెద్దలు సమక్షంలో కనుల పండుగా రథోత్సవ కార్యక్రమం సాగింది. ఆలయ పురోహితులు సీతారాముల ఉత్సవమూర్తుల విగ్రహాలను విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించి రథంపై కొలువుంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులు రథాన్ని పూలమాలలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామంలోని పురవీధుల వెంట రథోత్సవం సాగింది.

సాయిబాబ ఆలయ ప్రతిష్ట

మండలంలోని ఎదురుపాడు గ్రామంలో గురువారం గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సాయిబాబ ఆలయ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. పురోహితులు సాయిబాబా విగ్రహానికి విశేషపూజలు చేసి ఆలయంలో ప్రాణప్రతిష్ట చేశారు. అదేవిధంగా నూతనల ఆలయానికి పైగోపుర భాగంలో కలశ స్థాపన చేశారు.

ఘనంగా సీతారాముల రథోత్సవం

నందికొట్కూరు: పట్టణంలో సీతారాముల రథోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాజావీధిలో రామాలయం నుంచి పుర వీధుల గుండా రథోత్సవం సాగింది. వేడుకలలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, రామాలయ కమిటీ చైర్మన్ ఉపేంద్రారెడ్డి, సభ్యులు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్జి, శ్రీకాంత్, శ్రీధర్, లక్ష్మిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన బుడ్డా దంపతుల ఆస్తులు

ఆత్మకూరు: ఆర్వో సుధారాణికి అందించిన అఫిడవిట్ ప్రకారం శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దంపతులకు గత ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఆస్తులు పెరిగాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చరాస్తులు పరిశీలిస్తే రూ.47,35,533 ఉండగా.. బుడ్డా శైలజకు రూ.22,71,420 ఆస్తులు ఉండేవి. ప్రస్తుతం ఈ ఎన్నికల్లో వారి ఆస్తులు పరిశీలిస్తే.. చరాస్తుల్లో రాజశేఖర్‌రెడ్డి రూ.39,09,644, ఆయన భార్యకు వాహనాలు, బంగారం కలిసి రూ.96,32,854 విలువగల చరాస్తులు ఉన్నాయి.

అలాగే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి భూములు, భవనాలు, సొంత ఇళ్లు కలిపి గత ఎన్నికల సమయంలో రూ.64,39,000, బుడ్డా శైలజకు రూ.22,50,000 స్థిరాస్తులు ఉన్నాయి. ప్రస్తుతం సమర్పించిన అఫిడవిట్‌లో బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి రూ.58,99,200, బుడ్డా శైలజకు రూ.1,61,51,000 స్థిరాస్తి కలిగి ఉన్నారు. గతం కంటే రాజశేఖర్‌రెడ్డికి రూ.49,76,848, బుడ్డా శైలజకు రూ.2,12,62,434 ఆస్తి పెరగడం గమనార్హం.